క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్

కోరుట్లరూరల్: మండలంలోని సంగెం, యూసుఫ్‌నగర్, కల్లూర్,అయిలాపూర్ గ్రామాల్లో ఆలయాల అభివృద్ధి పనులకు ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పుల్లూరి వెంకటేశ్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్ సాయిరెడ్డి, నాయకులు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, పోతుగంటి శంకర్, రాజం, తుక్కారాం, ముక్కెర లింబాద్రి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి


కార్మికులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మల్యాల: పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సీఐటీయూ మండల నూతన కార్యవర్గంతో సమావేశమై మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేసి, పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, మండల అధ్యక్షుడు కోరెపు మల్లేశం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బడికి రాకపోతే ఇంటికొస్తా..


బడికి రాని పిల్లలను తీసుకెళ్తున్న హెచ్ఎం

ఇబ్రహీంపట్నం: బడికి రాకపోతే ఇంటికి వచ్చి పట్టుకపోతానని హెచ్ఎం అచ్చ విజయ భాస్కర్ అంటున్నారు. పాఠశాలకు రాని విద్యార్థులను ఇంటింటికి వెళ్లి పట్టుకుని బడికి తీసుకువస్తున్నారు. మండలంలోని వర్షకొండ ప్రాథమిక పాఠశాలలో బడికి రాని విద్యార్థులను ఇంటింటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు చెప్పి పాఠశాలకు తీసుకవస్తున్నారు. పాఠశాలలో చక్కటి బోధనను అందిస్తున్నామని బడికి రాకుండా చెడు తిరుగుళ్లు తిరుగవద్దని, తమ పిల్లలు బడికి రాకుంటే తల్లిదండ్రులు పంపించాలని, చదువు బంద్ చేయించకూడదని తల్లిదండ్రులకు తెలిపారు.

పీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారి తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

కథలాపూర్: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఎం.డీ సమియొద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కన్నకొడుకులపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న వృద్ధురాలు

జగిత్యాల: కన్న కొడుకులు తిండి పెట్టడం లేదంటూ ఓ వృద్ధురాలు ఆర్డీవో కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే... జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన లక్ష్మీరాజు అనే వృద్ధురాలు కొడుకులు తిండి పెట్టడం లేదని సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను ఆశ్రయించగా, వయోవృద్ధుల రక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆర్డీవో ఏవో తఫజుల్ హుస్సేన్ తెలిపారు.

‘ఉపాధి’కి గ్రామసభలు


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)


ఈజీఎస్ పనుల ఎంపికకు పెగడపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

పెగడపల్లి: వలసల నివారణకు ఉన్న గ్రామంలోనే కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు గుర్తించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తిస్తున్నారు. అక్టోబర్ 2 నుంచి మొదలై నెలాఖరు వరకు పూర్తి చేసేందుకు మండల అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడామైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత, కట్ట కాల్వల మరమ్మతులు, నీటి నిల్వ గుంతలు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. పథకంలో జాబ్ కార్డు పొందిన కూలీలందరికి ఆర్థిక సంవత్సరంలో వందరోజులు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు గానూ ముందుగా గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించడంతో పాటు, ప్రజల సమ్మతి తప్పనసరి కావడంతో ఇప్పటినుంచే ప్రక్రియ చేపట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)చేపట్టనున్న పనులు ఇప్పటి నుంచే గుర్తిస్తున్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలుండగా వాటిలో ఉపాధి పనులు గుర్తిస్తున్నారు.

ఉపాధిహామీతో ఆర్థిక భరోసా



గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న పనులతో నిరుపేద కూలీలకు ఆర్థిక భరోసా కలుగుతుంది. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధిహామీ పథకం ఎంతగానో ఆదుకుంటుంది. వలస కూలీలకు చేతినిండా పని దొరకడంతో పాటు కూలీలకు ఇబ్బందులు లేకుంగా పనులు దొరుతున్నాయి. వంద రోజులు పూర్తయినా కూలీలకు అదనపు పనులు కల్పించాలి.

– నిమ్మ ఎల్లమ్మ, బతికపల్లి

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం



వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించేందుకు గ్రామసభలు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఈ సారి ఎక్కువగా వ్యవసాయ అనుబంధమైన పనులకు ప్రాధాన్యత కల్పించనున్నాం. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల అంగీకారం మేరకు పనులు గుర్తించి తీర్మానాలు చేస్తున్నాం. అనుమతి మేరకు గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీవో

ధాన్యం కొనుగోళ్లయినా సక్రమంగా చేపట్టండి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లయినా సక్రమంగా చేపట్టాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని నాగులపేట, సంగెం, వెంకటాపూర్, మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి,మాదాపూర్, పైడిమడుగు, జోగిన్‌పెల్లి, కల్లూర్, ధర్మారం, అయిలాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని, వర్షాకాలం రైతుబంధు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లయినా సక్రమంగా చేసి సమయానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందని ఆరోపించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు సింగిరెడ్డి నర్సారెడ్డి, ఆదిరెడ్డి, భూమయ్య, జగన్మోహన్‌రావు, ఎంపీడీవో రామకృష్ణా, ఎంఏవో నాగమణి, జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, ఏపీఎం శంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, నాయకులు చీటి వెంకట్రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మహిళా సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.


సంగెంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భజన మంటపానికి భూమిపూజ

మండలంలోని వెంకటాపూర్‌లో ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో టీటీడీ నిధులతో నిర్మించే భజన మండపానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ బాస చంద్ర శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మండలంలోని మాదాపూర్‌కు చెందిన కే. భూమయ్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో మెరుగైన చికిత్స కోసం రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం బాధితుడికి అందజేశారు.

ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాలు మారలే

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాలు మారడం లేదని, ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి చెప్పిందేంటి నేడు చేస్తున్నదేంటని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆర్టీఎఫ్ బకాయిలను ఈనెల 27 లోపు విడుదల చేయాలని, లేని పక్షంలో చలో ఇందిరాపార్క్ నిర్వహిస్తామని, వేలాదిమంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థుల చలో కలెక్టరేట్ నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంతో గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమాలిక్, ఉపాధ్యక్షుడు బచ్చల రమేశ్, మచ్చ నితిన్, పొన్నం వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీచర్ల నిరసన

రాయికల్: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు చెరుకు మహేశ్వర శర్మ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని, ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించి బకాయి బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రమేశ్, నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిపల్లి: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని భీమారం మండలం వెంకట్రావుపేట పాఠశాలలో మంగళవారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు న్యాయంగా, హక్కుగా రావాల్సిన డీఏ, పీఆర్‌సి,పెండింగ్ బిల్స్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు గడ్డం తిరుమల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగమల్ల రమేష్, జిల్లా బాధ్యులు భీమయ్య, అంజన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న తపస్ నాయకులు

పాఠశాలకు స్మార్ట్ టీవీ వితరణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న గొల్లపల్లి గణేశ్ అనే ఉపాధ్యాయుడి సహకారంతో ధర్మపురికి పలువురు దాతలు పాఠశాలకు రూ.25 వేల స్మార్ట్ టీవీ అందించారు. ఉపాధ్యాయుడి సూచనతో స్పందించిన దాతలు స్మార్ట్ టీవీని అందించారు.కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, కాంప్లెక్స్ హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, హెచ్ఎం రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురిలో కుజదోష నివారణ పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు నిర్వహించారు. కుటుంబకలహాలు, వాస్తుదోషం, ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారు పూజల్లో పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో రాష్ట్ర స్థాయికి విద్యార్థి ఎంపిక

కోరుట్ల: పట్టణానికి చెందిన కేరళ హైస్కూల్ విద్యార్థి అబ్దుల్ ముజిల్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో అబ్దుల్ ముజిల్ అండర్ – 14 విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. నవంబర్ 2 న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ముజిల్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సెలీన్ బారి, కరస్పాండెంట్ ఎం.ఏ బారీ, ఉపాధ్యాయులు అభినందించారు.

జోనల్ స్థాయి క్రీడలకు ఎంపిక..

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఖిలాగడ్డ తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు జగిత్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. ఐకెల్ నాయక్ 400 పరుగుపందెంలో గోల్డ్‌మెడల్, ఎండీ.సోహైల్ 1500 మీటర్ల పరుగుపందెంలో గోల్డ్‌మెడల్, అభిరామ్ 5 కి.మీ నడక విభాగంలో సిల్వర్ మెడల్ పతకాలు సాధించారు. వీరు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ దాసరి రాజేందర్ తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీధర్, ముఖీమ్ అంజయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సారెడ్డి

మల్లాపూర్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీచైర్మన్ అంతడుపుల పుష్పలత, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, సొసైటీ సీఈవో పాదం భూమేష్, డైరెక్టర్ పూండ్ర లక్ష్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు రాజం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు వినియోగించుకోవాలి

ధర్మపురి: రోగులకు వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నేరెల్లలో మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. వ్యాక్సిన్ నిల్వలపై ఆరా తీశారు. కనీసం 3 నెలలకు సరిపడా మందులు నిల్వ ఉండాలని సూచించారు. ఆశా కార్యకర్తలకు దిన చర్యల రిజిస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వివేక్, అనూష, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: నవంబర్ 10న కోరుట్ల పట్టణంలో నిర్వహించనున్న సీపీఎం పార్టీ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహాసభకు జిల్లాలోని ప్రజలు, ప్రముఖులు, కార్మికులు, రైతులు, వ్యాపారులు, ప్రజాప్రతినిదులు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎంఎ చౌదరీ, పార్టీ జిల్లా కన్వీనర్ గుగులోతు తిరుపతినాయక్, గర్వందుల రమేశ్ గౌడ్, చారి, చంద్రయ్య, సురేశ్, మహిపాల్, రఫిక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: పట్టణంలోని 9వ వార్డు పరిధి ధరూర్ క్యాంపు రామాలయం నుంచి వినాయకనగర్ దారి 33 ఫీట్లు ఉండేది. ఇటీవల ఈ రోడ్డులో డ్రైయినేజీ నిర్మించిన బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తమ వారి భూమికి నష్టం జరగొద్దని రోడ్డును ఆక్రమించి డ్రైయినేజీ నిర్మించారు. దీంతో రోడ్డు విస్తీర్ణం 25ఫీట్లకు కుంచించుకుపోయింది. రోడ్లను కాపాడాల్సిన అధికారులే నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై డ్రైయినేజీ నిర్మించడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల, సెల్ నంబర్:9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మల్యాల, మార్కెట్‌యార్డు, ముత్యంపేట, తాటిపల్లి, రామన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వెల్మ లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ల సతీశ్ రెడ్డి, కటుకం వినయ్, తహసీల్దార్ మునీందర్, ఏపీఎం రాజయ్య, సీసీ గంగారాజం, ఆర్ఐ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న డీఎస్పీ,సీఐ

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన హోంగార్డు సుబ్బరాజు ఈ నెల 10న రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. సుమారు ఇరవై ఏళ్ల పాటు హోంగార్డుగా పనిచేసిన సుబ్బరాజు మృతితో కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు,సీఐ నిరంజన్‌రెడ్డి తమ వంతుగా రూ.50 వేలను మంగళవారం అతని కుటుంబసభ్యులను కలిసి అందజేశారు. ఉన్నతధికారులతో మాట్లాడి కుమారుల్లో ఒకరికి హోంగార్డు ఉద్యోగం ఇప్పించడానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆర్థికసాయం చేసిన అధికారులకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దహన సంస్కారాలకు సాయం

మల్యాల: మండలంలోని బీజేపీ కార్యకర్త జిల్లెల్ల రమేశ్ భార్య అనారోగ్యంతో మంగళవారం మృతిచెందగా, బీజేపీ జిల్లా, పార్లమెంటరీ నాయకత్వం ఆదేశాల మేరకు దహన సంస్కారాల ఖర్చులు మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్ బాధిత కుటుంబానికి అందజేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థినికి సన్మానం

మల్యాల: మండలంలోని రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సంకుర్తి అనూషను బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బొడిగె సురేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థిని ఏకపాత్రాభినయంలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకులు

కథలాపూర్: మండలంలోని కలిగోట గ్రామం నుంచి గిరిజన తండా వరకు రోడ్డుపై ఉన్న గుంతలను యువకులు మంగళవారం పూడ్చారు. రోడ్డుపై ఉన్న గుంతల్లో మట్టిని నింపి చదును చేశారు. గిరిజన తండాకు చెందిన ధరవాత్ రవీందర్, జలందర్ అనే యువకులు రోడ్డుపై ఉన్న మట్టిని పూడ్చివేసినట్లు స్థానికులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలంలోని పలు బాధిత కుటుంబాలను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదిగిరి రమ్య, ఆదిరెడ్డి, వంగ వెంకటేశ్, చెన్నమనేని రవీందర్ రావు, బుడుత శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది మండల కార్యవర్గం

మల్యాల: గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) మండల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరెపు మల్లేశం, ప్రధాన కార్యదర్శి ముప్పారపు పోచయ్య, ఉపాధ్యక్షుడిగా గసిగంటి శ్రీనివాస్, కోశాధికారిగా బోనాల మల్లేశం, ప్రచార కార్యదర్శిగా మల్యాల మహేశ్, గౌరవ అధ్యక్షుడిగా మల్యాల దేవయ్య, సభ్యులుగా సదుల సురేశ్, బామండ్ల శాంతవ్వ, దామెర్ల గంగారాం, చెవుల మద్ది లక్ష్మి, చిట్యాల రాజయ్య, కొక్కుల బుచ్చయ్య, గుడిసె లక్ష్మి, ఎలుక గాయత్రి, కాయితీ భాస్కర్, గజ్జెల మొండయ్య, నక్క దుర్గయ్య, మాచర్ల పోచయ్యను ఎన్నుకున్నారు.

ధర్మశాల నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్‌లో జగిత్యాల విద్యార్థిని

జగిత్యాల: హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాలలో జరుగుతున్న నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్‌లో జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి ఆకుల అనూషకు అవకాశం దక్కింది. అక్టోబర్ 22 నుంచి 31వ తేదీ వరకు 10 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా

రాయికల్: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి ఇద్దం సుధీర్‌రెడ్డి మంగళవారం రాజీనామా చేసినట్లు తెలిపారు.కాంగ్రెస్ నాయకుడు మారు గంగారెడ్డి హత్యకు నిరసనగా పార్టీ సభ్యత్వానికి ,పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుష్ఠువ్యాధి కేసులు తగ్గించేలా చూడాలి

జగిత్యాల:జిల్లాలో కుష్ఠువ్యాధి కేసులు పెరుగుతున్నాయని, తగ్గించేలా చూడాలని జోనల్ కో–ఆర్డినేటర్ శిరీష అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాట్లాడుతూ.. వాటికి సరిపడా మెడిసిన్ ఉందా..?లేదా రికార్డులు పరిశీలించారు. డెంగీ కేసులు తగ్గుముఖం పట్టడానికి కృషిచేసిన వైద్య సిబ్బంది సేవలను అభినందించారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో సమియోద్దీన్, డాక్టర్ శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామస్తులు దుబాయిలో ఉంటున్న వారు ఓ బాలుడి వైద్యం కోసం రూ. 15 వేలు ఆర్థికసాయం మంగళవారం అందించారు. మల్యాల మండలకేంద్రానికి చెందిన హుస్సేన్– రుబీనా దంపతుల 10 నెలల కుమారుడు అనారోగ్యానికి గురయ్యారు. బొమ్మెన దుబాయి సంఘం సభ్యులు స్పందించి రూ. 15 వేలు ఆర్థికసాయం అందించడంతో బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.